తొలిసారి ఎవరికో..?



మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి శ్రీరామ్, పర్యవేక్షిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ తుషార్‌కాంత మహంతి, కలెక్టర్ గౌతమ్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కీలకంగా మారిన యువ ఓటర్లు

- జిల్లాలో 18 నుంచి 19 ఏళ్ల లోపు 43,396 మంది
- ఖమ్మం నియోజకవర్గంలో 13,599 మంది
- ఓటింగ్ శాతం పెంచేలా అధికారుల కసరత్తు
- కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

ఖమ్మం సహకారనగర్: ఒకప్పుడు ఎన్నికలంటే ఆ కొద్ది రోజులే హడావుడి ఉండేది... ఆ తర్వాత అంతగా పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఈసారి అలా కాకుండా ఓటింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందుకు ఎవరూ ఊహించని విధంగా అవగాహన కార్యక్రమాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అందరి దృష్టి ఎన్నికలపై పడింది. గతంలో ఓటరుకు అవగాహన కల్పించిన సంఘటనలు ఉన్నా.. ఈసారి వినూత్నంగా కళాశాలల్లో విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించడంతో వారితో పాటు వారి తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారికి చెప్పేలా పరిస్థితులు మారాయి.

ఓటరు నమోదు నుంచి...

జిల్లాలో 18 ఏళ్లు దాటిన విద్యార్థులు ఓటింగ్ చేసేలా ఈ ఏడాది అధికార యంత్రాంగం విరివిగా అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఓటు నమోదుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఆ తర్వాత భారీగా ఓటరు నమోదు జరిగింది. అలాగే జిల్లాలో పెరిగిన ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ శాతం పెంచేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఈనేపథ్యంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 18 నుంచి 19 ఏళ్ల లోపు 43,396 మంది యువ ఓటర్లు ఉండగా.. ఒక్క ఖమ్మం నియోజకవర్గంలోనే 13,599 మంది ఓటర్లు ఉండడం గమనార్హం.

పోలింగ్ శాతం పెంచేలా..

పోలింగ్ శాతం పెంచేలా అధికార యంత్రాంగం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారితో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సైతం ఓట్లు వేసేలా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రాబోయే ఎన్నికలు సత్ఫలితాలిచ్చే అవకాశం మెండుగా కనిపిస్తున్నాయి.

అవగాహన ఇలా..

నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా ఎన్నికల అబ్జర్వర్ తుషార్ కాంత మహంతితో పాటు కలెక్టర్ ఓటు ప్రాముఖ్యతను తెలిపేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. నోడల్ అధికారి కొండపల్లి శ్రీరామ్ ఓటు నమోదు, ప్రతీ ఒక్క ఓటరు ఓటు వేసేలా చూడాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధాన అజెండా ప్రలోభాలకు గురికావొద్దని, ఓటు బాధ్యతాయుతమైన ఆయుధంగా అభివర్ణించారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించడంతో పాటు విద్యార్థులకు యాప్ డౌన్‌లోడ్, కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన పలు యాప్‌లపై అవగాహన కలిపించారు.

ఓటు విలువైంది..



నాకు ఈ సారి ఓటు వచ్చింది. తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటు వేయబోతున్నా. ఎన్నికల్లో సరైన నాయకుడిని ఎంపిక చేసుకునేందుకు నాకొక మంచి అవకాశం లభించింది. ప్రలోభాలకు లొంగకుండా మంచి గుణగణాలను కలిగిన వ్యక్తిని శాసనసభకు పంపిస్తే అభివృద్ధి చేస్తారు.

– భాగ్యలక్ష్మి, విద్యార్థిని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

కీలుబొమ్మగా మారొద్దు..



ఎన్నికల సమయంలో స్వేచ్ఛగా ఓటు వేయాలి. ఎవరో చెప్పిన మాటలు విని ఓటును అమ్ముకుంటే ఐదేళ్లపాటు కష్టాలు పడాల్సి వస్తుంది. బరిలో ఉన్న అభ్యర్థులను తెలుసుకొని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటేసి గెలిపించుకోవాలి. అప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుంది.

– కేవీఎస్ వైష్ణవి, విద్యార్థిని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

ఆలోచనతో ఓటు వేయాలి..



ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతను గుర్తించాలి. ఎన్నికలంటే సమాజాభివృద్ధికి బాటలు వేస్తాయి కాబట్టి నేటి యువత ఓటు వేసే అభ్యర్థి పారదర్శక పాలన అందిస్తాడా? లేదా? అనేది ఆలోచించాలి. యువత అవగాహన, చైతన్యంతో ఓటేయాలి.

– ఆర్.గోపి, విద్యార్థి, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల

ఓటు అమ్ముకోవద్దు..



ఓటేసే ప్రతి ఒక్కరూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. అందుకు ఓటుకు నోటు తీసుకోవద్దని అమ్మ, నాన్నలకు చెప్పాను. తొలిసారిగా ఓటు వేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. నిబద్ధతతో ప్రజాసేవ చేసే వారిని ఎన్నుకుంటే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– పిడియాల వెంకట్రావు, విద్యార్థి, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల

సమాజం బాగుండాలని భావించా..



41వ డివిజన్‌లో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్



ఈర్లపుడి ఎస్సీ కాలనీలో డప్పు కొట్టి సందడి చేస్తున్న పువ్వాడ



ఇంటింటి ప్రచారం చేస్తున్న పువ్వాడ వసంతలక్ష్మి

ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: అట్టడుగు వర్గాలు, బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం జరగాలని, అంబేద్కర్ వాదాన్ని బలంగా నమ్మి సమసమాజం బాగుండాలని భావించిన వాడిని కాబట్టి జెడ్పీసెంటర్‌లో 14 అడుగుల డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశానని ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని 4, 5, 6, 12 డివిజన్లు, 41వ డివిజన్‌లో సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ ఆధ్వర్యాన, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలు, 58వ డివిజన్ బీసీ కాలనీలో ఏఎంసీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అధ్వర్యాన, ఖమ్మంలో బీఆర్ఎస్ మైనార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ ఆధ్వర్యాన జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో పువ్వాడ పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించి నూతన సెక్రటేరియట్‌కు డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సెక్రటేరియట్‌గా నామకరణం చేసి తన చిత్తశుద్ధి చాటుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు, కానీ ప్రజలకు ఇంకేం గ్యారంటీలు ఇస్తారని ఎద్దేవా చేశారు. మైనార్టీలకు అండగా ఉంటానని, తండాలను గ్రామాలుగా చేసి గ్రామస్తులే పరిపాలించే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుని గెలిపించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. అంతా కారు గుర్తుపై ఓటు వేసి అత్యంత భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈనేపథ్యంలో పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ 46వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ ఆధ్వర్యాన భారీ ప్రదర్శన నిర్వహించారు. అలాగే పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ ఆయన సతీమణి పువ్వాడ వసంతలక్ష్మి నగరంలోని 56వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేయగా.. కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి సత్యనారాయణ పాల్గొన్నారు.

దప్పుకొట్టి సందడి..

రఘునాథపాలెం మండలం ఈర్లపుడి ఎస్సీ కాలనీలో పువ్వాడ అజయ్‌కుమార్ డప్పు కొట్టి సందడి చేశారు. కళాకారుల నృత్యానికి, వాయిద్యాలకు డప్పు కలిపి ఆకట్టుకున్నారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, వైస్ ఎంపీపీ గుత్తా రవితో పాటు అజ్మీరా వీరునాయక్, కార్పొరేటర్లు కోటి, జ్యోతిరెడ్డి, లక్ష్మి నాగేశ్వరరావు, కృష్ణ, వెంకన్న, ప్రతాప్, సత్యనారాయణ, గంగాధర్, కె.భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాసోత్సవం



నేలకొండపల్లి: రాజేశ్వరపురంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి: కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఖమ్మం నగరంలోని ట్రంక్‌రోడ్‌లో ఉన్న శ్రీ భ్రమరాంబ శ్రీ గుంటుమల్లేశ్వరస్వామి దేవస్థానంలో జ్యోతిర్లింగార్చన, నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశాక సాగర్ కెనాల్‌లో తెప్పోత్సవం నిర్వహించారు. పలువురు మహిళలు లింగాకారంలో సహస్రదీపాలను వెలిగించగా.. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి: దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏం అభివృద్ధి చేసిందని ఓటేయాలో ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ నాయక్ సూచించారు. ఆదివారం బర్లగూడెం గ్రామానికి చెందిన బానోత్ రాజ్‌కుమార్ ఆధ్వర్యాన బొజ్జాయిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో 30 కుటుంబాలు కాంగ్రెస్ నుంచి హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని వెల్లడించారు. మిషన్ భగీరథ,మిషన్ కాకతీయ, సాగునీటి పథకాలపై ఇతర రాష్ట్రాల మేధావులు అధ్యాయనం చేస్తున్నారని, అందరి ఆశీస్సులతో సీఎం కేసీఆర్ తెలంగాణ వ్యవసాయాన్ని దేశంలో ముందు వరుసలో నిలబెట్టారని తెలిపారు. నాటి కరెంట్ కష్టాలు, వ్యవసాయ బాధలు, వలసలు, పింఛన్ కోసం ఎదురుచూసే పరిస్థితులను ఓసారి గుర్తు చేసుకొని ప్రస్తుత పరిస్థితిని గమనించాలన్నారు. కేసీఆర్ పాలనలో గిరిజనతండాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. యువత గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, మళ్లీ అధికారంలోకి వచ్చాక చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు, జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌నాయక్, ఎంపీటీసీ మాలోత్ శంకర్, మూడ్ శ్రీను, ఈసు, వడియాల కృష్ణారెడ్డి, ధరావత్ సూర్య, రాందాస్, బానోత్ రాంజీ, నున్నావత్ చిన్నా, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే హరిప్రియ

సంబరంగా బ్రాహ్మణ వన సమారాధన



వన భోజన కార్యక్రమంలో బ్రాహ్మణ బంధువులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీనివాసనగర్ మామిడి తోట(ఎంఎన్ఆర్ గార్డెన్స్)లో బ్రాహ్మణ వన సమారాధన కార్యక్రమం ఆదివారం సంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కైలాస గౌరీ వ్రతం, మహా శివునికి అభిషేకం వంటి పూజలు చేసి, సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. కాగా, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ కార్యక్రమానికి హాజరై ఓట్లు అభ్యర్థించారు. బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు తాటికొండల సీతారామశాస్త్రి, గంటెల శ్రీనివాసరావు, మాటూరి లక్ష్మీనారాయణ(వీఎల్), నర్సింహారావు, మారంరాజు, పలివెల, కోసూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రఘునాథపాలెం: ప్రతీ రోజు యోగ, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఖమ్మం గురుదక్షిణ ఫౌండేషన్ యోగ గురువు రమేశ్‌నాయుడు తెలిపారు. ఆదివారం రఘునాథపాలెంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల ఖమ్మం బాలికలు- 1లో విద్యార్థులకు ధ్యానం, యోగాసనాలు నేర్పించారు. ప్రిన్సిపాల్ స్వాతి, యోగాసాధకులు కె.సీతా రాములు, పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' సేవలు అభినందనీయం



చెక్కు అందిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మ్యాక్స్ కళాశాలలో బీఫార్మసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిరుపేద విద్యార్థిని వేగినాటి దీపికకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు రూ.50 వేల ఫీజును అందించడం అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతూకూరి మధు అన్నారు. ఆదివారం నగరంలోని పీఆర్‌టీయూ భవనంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి చెక్కు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యుడు యలమద్ది వెంకటేశ్వర్లు, మ్యాక్స్ కళాశాల కరస్పాండెంట్ బొంతు సత్యనారాయణ, సంస్థ బాధ్యులు కొల్లు రఘు, సిరిపురపు రమణారావు, సాధు లక్ష్మణ్‌రావు, కే.వీ.నాయుడు, కొంగర పురుషోత్తం, మద్దినేని ప్రసాద్ రావు, పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కరెంట్ కోత

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీనగర్‌కాలనీ, వైఎస్ఆర్‌నగర్‌కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఫీడర్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనగర్‌కాలనీ, వైఎస్ఆర్‌నగర్, వెలుగుమట్లకాలనీ, పారిశ్రామిక ప్రాంతంలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

వాహనాల తనిఖీ

తిరుమలాయపాలెం: మండలంలో మాదిరిపురం చెక్‌పోస్టు వద్ద ఆదివారం మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్ వాహన తనిఖీల ప్రక్రియను పరిశీలించారు. అలాగే మహ్మదాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరతండా పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని అజీజ్‌గల్లీలోని కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమాతె ఇస్లామి హింద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ మాట్లాడగా.. అన్జుమ్, హుస్సైన్‌బీ, ఖాసిమా షాహిన్, గౌసియా, అతహర్, షాహెదా, సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై నిరంతర పోరాటం

నేలకొండపల్లి: ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యాన అవినీతిపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు కనకపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి..



ఓట్లు అభ్యర్థిస్తున్న నున్నా రవికుమార్

తిరుమలాయపాలెం: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని పాలేరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నున్నా రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కాకరవాయిలో ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఆయన వెంట నల్లగట్టు శ్రీనివాస్, గంట్ల లక్ష్మారెడ్డి జిల్లీ, నాయకులు నరేందర్‌రావు, శ్రీనివాసరెడ్డి, ఉపేందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



తిరుమలాయపాలెం: సుబ్లేడులో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి: పార్టీలో చేరిన వారితో పొంగులేటి ప్రసాదరెడ్డి

పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం/కూసుమంచి: ఈ నెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రానున్న ఇందిరమ్మ ప్రజా పాలనలో ప్రజా సంక్షేమ పథకాలు అమలు కాబోతున్నాయని పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలలో ఆయన మాట్లాడారు. అమరుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లబ్ధి జరిగిందని, నీళ్లు, నిధులు, నియామకాల పేరిట దోపిడీ చేసి రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, తనను ఓడించేందుకు రూ.వందల కోట్ల డబ్బు సంచులతో వస్తున్నారని, ఆ డబ్బులు మనవేనని వాటిని తీసుకుని హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బోడ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, మందడి ఇజ్రాయిల్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. కాగా పొంగులేటి విజయాన్ని కోరుతూ.. కూసుమంచి మండలంలోని ముత్యాలగూడెంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మంకెన వాసూ, దాసరి వెంకన్న, బొల్లికొండ శ్రీనివాస్, కోనేటి రామారావు, పాశని ప్రభాకర్, తాటికొండ రాము, పేరెల్లి అశోక్, పాల్గొన్నారు.

పొంగులేటి సమక్షంలో చేరిక..

కూసుమంచి మండలంలోని చేగొమ్మ గ్రామ సర్పంచ్ రెడ్డిమళ్ల రమణమ్మతో పాటు చేగొమ్మ, జీళ్లచెరువు గ్రామాలకు చెందిన మరికొందరు శనివారం రాత్రి జీళ్లచెరువులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు రామసహాయం రఘురామిరెడ్డి, పొంగులేటి ప్రసాదరెడ్డి సమక్షంలో చేగొమ్మ, లోక్యాతండా గ్రామాలకు చెందిన 65 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు సుడిగాలి కిషన్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ వడిత్య సేత్రాం నాయక్, కొండపర్తి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం

ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూస్తుంటే ఈసారి ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పని చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా చూస్తానని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని, అందుకు హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, ధరావత్ రాంజీ, చరణ్‌రెడ్డి, మల్లిబాబుయాదవ్, రాజేశ్, మాలోత్ సరిరాంనాయక్, బానోత్ బాబు, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, అప్పన పిచ్చయ్య, నల్లమోతు లక్ష్మయ్య, ఆరెం రవి, ఏపూరి మహేందర్, దమ్మలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోరం కనకయ్య

కాంగ్రెస్‌లో చేరిక

మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన చల్లా వెంకన్న ఆధ్వర్యాన కొత్తలింగాల క్రాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుమారు 20 కుటుంబాలు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి సమక్షాన బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఇల్లెందు గడ్డపై కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపునకు కృషి చేయాలన్నారు. నాయకులు నర్సింహారెడ్డి, పిచ్చయ్య, జగన్నాథరెడ్డి, మహేందర్, రాంబాబు, నర్సయ్య, రవి పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారానికి ఖండన..

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో బీఆర్ఎస్‌పార్టీకి చెందిన కొందరికికండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీ వారు బీఆర్ఎస్‌లో చేరినట్లు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సర్పంచ్ షేక్ మస్తాన్ అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడి బీఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ చాగంటి నారాయణ, కాంగ్రెస్ నాయకులు మంకెన వెంకటేశ్వరరావు, సుల్తాన్ వీరబాబు, మానుకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ రాజకీయాలకు చోటు ఇవ్వను..



ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



పాటివారిగూడెం గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: అమాయక ప్రజలను రెచ్చగొట్టి కొంతమంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై అనవసరంగా విరుచుకుపడుతున్నారని, తమ నాయకుల నాలుక కోస్తామంటున్నారని, కానీ తాము తలచుకుంటే గొంతులు కోయగలమని, అది తమ సంస్కృతి కాదని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారసభల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇంతకాలం తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కులమతాలు, రాజకీయాలకతీతంగా అడిగినది లేదనకుండా ఇచ్చానని, పాలేరు ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రజలందరూ సుఖ,సంతోషాలతో ఉండాలన్నదే తన ధ్యేయమని తెలిపారు. ఈ ఐదేళ్లలో ఎక్కడా గొడవలను ప్రోత్సహించలేదని పేర్కొన్నారు. గత పదేళ్లలో సీఎం కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించారని, అందులో భాగంగానే పాలేరు నియోజకవర్గంలో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేశామని, రాబోయే కాలంలో మరింత అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పేద పిల్లల ఉన్నత చదువుల కోసం తన వంతుగా సహకరించానని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. అలాగే ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మాయమాటలతో, కల్లబొల్లి కబుర్లతో స్థానికేతరులు ఓట్ల కోసం వస్తున్నారని, ఎవరు మంచి చేస్తారో ఆలోచించి ఓటు వేయాలన్నారు. లోకల్ బిడ్డగా మీ అందరికీ అందుబాటులో ఉండే కందాళను మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యాన మండలంలోని పాటివారిగూడెం గ్రామంలో కందాళ గెలుపును కాంక్షిస్తూ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ చంద్రావతి, ఎ.వరప్రసాద్, బుర్రా మహేశ్, పేరం వెంకటేశ్వర్లు, బాలూనాయక్, ఎ.ఉపేందర్, పి.రాము, నరేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట, చెన్నారం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు ఆదివారం కందాళ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.